క్లుప్తంగా

ఘనంగా అక్షయ తృతీయ వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రణమండల ఆంజనేయుడు

ఆదోని అర్బన్: అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్థానిక రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామికి ఫల పంచామృతాభిషేకం, గంధలేపన అలంకారం, తులసీ పూలు, ఆకులు, మహామంగళహారతి, నైవేద్యం తదితర పూజలు నిర్వహించారు. అలాగే పట్టణశివారులోని మంగరాయకాలనీలో వెలిసిన మంగరాయ ఆంజనేయస్వామికి గంధలేపన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి పంచామృతాభిషేకం, తేనాభిషేకం, గంధ లేపన అలంకారం, మహామంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు.

దురలవాట్లకు బానిస కావొద్దు



కరపత్రాలను అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆదోని రూరల్: యువకులు దురలవాట్లకు బానిస కావొద్దని డీవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు వీరేష్ అన్నారు. యువత మార్పు కోసం చేపట్టిన ×యువ సైకిల్ యాత్ర¤ బుధవారం రెండోరోజు కొనసాగింది. పట్టణంలోని కొత్త బస్టాండు, మండిగిరి, ఎస్కేడీ కాలనీ, క్రాంతినగర్, తిమ్మారెడ్డి బస్టాండు ప్రాంతాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందామని, యువత భవిష్యత్‌కు బంగారు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సతీష్, వెంకటేష్, మోహన్, నవీన్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అవోపా పట్టణ అధ్యక్షుడిగా శ్రీనాథ్‌గుప్తా



ఆదోని అర్బన్: ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆదోని పట్టణ అధ్యక్షుడిగా శ్రీనాథ్‌గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అవోపా కార్యదర్శి ఎన్.రఘు, కోశాధికారి యాదగిరి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం స్థానిక రాజశ్రీ కాంప్లెక్స్ మైక్రోటెక్ ఆఫీసులో జరిగిన సర్వసభ్య సమావేశంలో శ్రీనాథ్‌గుప్తాను ఏకగ్రీవంగా సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్లలో 25కు పైగా మెడికల్ క్యాంపులు ఎన్నో ప్రజాహిత సేవా కార్యక్రమాలు, సంఘసేవ కార్యక్రమాలు అవోపా ద్వారా నిర్వహించడం జరిగిందన్నారు. నాలుగు దక్షిణాది రాష్ట్రాల్లో నాలుగు ప్రముఖ అవార్డులను కూడా శ్రీనాథ్‌గుప్తా పొందడం జరిగిందన్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ మరోసారి తనకు అవకాశం కల్పించడంతో అవోపా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తానన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోమప్ప మెమోరియల్ హాల్‌లో గురువారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి శ్రేణుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ బుధవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ కమిటీ నాయకులు, మండల స్థాయి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

8న జాబ్ మేళా

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 8వ తేదీన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ మేరకు తన నివాసంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్‌రాజ్ కుమార్ తదితరులతో కలిసి జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ జాబ్‌మేళాలో 13 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొననున్నాయని, అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు.

మదర్సాలో సమ్మర్ క్యాంప్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని గోనెగండ్ల రోడ్‌లోని బాలికల మదర్సా దారుల్ హుదా లిల్ జనాత్‌లో గురువారం నుండి నెల రోజుల పాటు బాలికలకు ఇస్లామిక్ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మదర్సా కరస్పాండెంట్ షంషున్నిసా బుధవారం తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో 10 సంవత్సరాలు పైబడిన బాలికలకు ధార్మిక, నైతిక విలువలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఖురాన్‌లోని కొన్ని సూరాల కంఠస్థం, మస్నూన్ దువాలు, ఇస్లామియా ఆఖీదహ్, నైతికతలు తదితర అంశాలపై సుశిక్షితులైన ఆలిమాలతో శిక్షణ, బోధనలు ఉంటాయని తెలిపారు.

మహనీయుడు.. బసవేశ్వరుడు

మంత్రాలయం: సమాజంలో పేరుకుపోయిన మూఢాచారాలను తన రచనల ద్వారా ఖండించిన బసవేశ్వరుడు మహనీయుడని పలువురు కొనియాడారు. తన ఉపదేశాలతో సమాజాన్ని మేల్కొలిన గొప్ప తత్వవేత్త అని అన్నారు. బుధవారం బసవేశ్వర స్వామి జయంతి సందర్భంగా ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో వైభవంగా వేడుకలు నిర్వహించారు. మంత్రాలయంలో వీరశైవ లింగాయతీ సంఘం ఆధ్వర్యంలో బసవ జయంతి వేడుక ఘనంగా జరిగింది. స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం చేపట్టారు. కలశాలతో సంప్రదాయ బద్ధంగా ఊరేగించారు. స్థానిక వీరభద్రస్వామి ఆలయం నుంచి రాఘవేంద్రస్వామి మఠం వరకు పురవీధుల్లో ఊరేగింపు సాగింది.



మంత్రాలయంలో బసవేశ్వర చిత్రపటాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు



కోసిగిలో ఎద్దుల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కనుల పండువగా..

నందవరం: వీరశైవ లింగాయితీల ఆరాధ్యదైవంగా కొలిచే బండే బసవేశ్వరుడి రథోత్సవం కనుల పండువగా సాగింది. ఆలయ అర్చకులు పంపాతి గౌడ్, బసవరాజు గౌడ్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామ రైతులు తమ వృషభాలకు ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తిని మహారథంపై ఉంచి నంది కోళ సేవతో పాటు భక్తుల జయ జయ ధ్వానాల మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న వారిల్లో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ సురేష్‌గౌడ్, కోసిగి తహసీల్దార్ రుద్రాగౌడ్, గ్రామ సర్పంచ్ అక్కమహాదేవి, బండేష్‌స్వామి, భక్త బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వీరశైవమతం పీఠాధిపతి ఆధ్వర్యంలో..

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలో బసవ స్వామి జయంతి వేడుకలు వీరశైవమతం పీఠాధిపతి శివయ్యస్వామి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. బసవేశ్వర స్వామి చిత్రపటానికి పూల వేసి ప్రత్యేక పూజలు చేశారు. బసవ స్వామి జయంతి సందర్భంగా వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక నిర్వహించారు. మానవులందరూ దైవం దృష్టిలో సమానం అని అన్ని మతాలు ఒక్కటేనని సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని బోధించిన మహనీయుడు బసవేశ్వర స్వామి అని కొనియాడారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వీరశైవులు, కురాకుల సురేష్ బాబు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో బసవేశ్వర స్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తేరు బజార్‌లోని శ్రీబసవేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ పట్టణ అధ్యక్షుడు, ఒకటవ వార్డు కౌన్సిలర్ కామర్తి నాగేషప్ప ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించి భక్తులకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, పార్టీ నాయకులు విరూపాక్షిరెడ్డి, ఎంకే శివ ప్రసాద్, సునీల్‌కుమార్, శివప్పగౌడ్, కోటకొండ నరసింహులు, కెరె రాము, మహబూబ్‌బాషా, రఘువీర, చంద్రశేఖర్, ప్రభాకర్, సయ్యద్‌చాంద్, లతారెడ్డి, గోపాల్, విశ్వనాథ్‌కృష్ణ, గణేష్ పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో పట్టణంలో అన్నదానం చేస్తున్న బుట్టారేణుక, బుట్టా శివనీలకంఠ

ఆకట్టుకున్న నందికోల సేవ

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో బసవ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో కొలువుదీరిన శంకరలింగేశ్వర స్వామి దేవాలయంలో వేకువ జామున ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, వెండి కవచ అలంకరణ, ఆకు పూజ, మహా మంగళ హారతులు గావించి విశేష పూజలు చేపట్టారు. సాయంత్రం శ్రీ బసవేశ్వర స్వామి చిత్ర పటాన్ని, ఎద్దులకు ఎస్ఐ హనుమంత రెడ్డి, ఆలయ కమిటీ పెద్దలు సమక్షంలో పూజలు చేసి ఆలయం నుంచి కలశాలు, మేళతాళాలు డప్పువాయిద్యాలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బసవేశ్వర స్వామి వేషాధారణలో భక్తుడు విన్యాసాలు చేస్తూ నందికోలు ఆడుతూ కనపించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయతీలు బుక్కిటి వీరేష్, రాజమౌళి, జగదీష్ స్వామి, బెట్టన గౌడ, ఉమేష్ గౌడ, అయ్యన్న గౌడ, మూర్తి గౌడ, బసవరాజు, జీరు మల్లి, మట్టి విజయ్, శివ, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



నందవరంలో కలశాలతో రథోత్సవంలో పాల్గొన్న మహిళలు, భక్తులు



గోనెగండ్లలో పూజలు చేస్తున్న వీరశైవమతం పీఠాధిపతి శివయ్యస్వామి

సామాజిక మార్పునకు ఎనలేని కృషి



బసవేశ్వరుడు, శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

ఆదోని సెంట్రల్: ఆధ్యాత్మికవేత్త బసవరాజు, మహాకవి శ్రీశ్రీ సామాజిక మార్పునకు ఎనలేని కృషి చేశారని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప పేర్కొన్నారు. స్థానిక నైస్ అకాడమీలో బుధవారం మహాకవి శ్రీశ్రీ, విశ్వగురువు బసవన్నల జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుడు కులమతాలకు అతీతంగా సమాజాగమనాన్ని మార్చడానికి ఎంతో కృషి చేశారన్నారు. బసవన్న కేవలం ఆధ్యాత్మికవేత్త మాత్రమే కాదని, ఒక సంఘసంస్కర్త అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ సక్కిరి భాస్కర్, డివిజన్ కార్యదర్శి స్వయంప్రభ, రిటైర్డ్ తహసీల్దార్ షేక్షావలి, నాగమణి, రామలక్ష్మి, మహాదేవి, ఓంకార్, రాజశేఖర్, నల్లారెడ్డి, నరసప్ప తదితరులు పాల్గొన్నారు. పలువురు తమ కవితా గానాన్ని వినిపించి సభను అలరింపజేశారు.

ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్

ఆదోని సెంట్రల్: పాలీసెట్ ఎంట్రెన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. పట్టణంలోని పురపాలక ఉన్నత, పాఠశాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, వివేకానంద జూనియర్‌కళాశాల, నారాయణ జూనియర్ కళాశాలతో పాటు మరో 5 కేంద్రాల్లో పాలీసెట్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 2,771 మంది దరఖాస్తు చేసుకోగా 2,439 మంది పరీక్షలు రాసినట్లు తెలిపారు. 332 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు చేపట్టారన్నారు.

శుభకార్యం

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని విశాలగార్డెన్‌లో బుధవారం వైఎస్ఆర్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అయిన కేఆర్ లక్ష్మీకాంతరెడ్డి మనవడు సంతోష్‌రెడ్డి, పూజితల వివాహ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, బుట్టాశివనీలకంఠ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా నందవరం, ఎమ్మిగనూరు మండలంతో పాటు పట్టణంలోని పార్టీ శ్రేణుల ఈ వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

చిన్మయ మిషన్‌లో వేసవి శిబిరం



మాతృపూజలో పాల్గొన్న చిన్నారులు

ఆదోని అర్బన్: స్థానిక చిన్మయ మిషన్‌లో ఆదోని చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో బాలల వేసవి సాధన శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ క్యాంపులో భజనలు, స్తోత్రాలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. చివరి రోజు పిల్లల చేత తల్లులకు మాతృపూజ నిర్వహించారు. ఈ క్యాంపుకు బ్రహ్మచారి శ్రీవత్స చైతన్య ఆచార్యగా వ్యవహరించారు. వీరికి చిన్మయ దేవి గ్రూపు సభ్యులు సహకారం అందించారు. ఈ క్యాంపులో 120 మంది పిల్లలు పాల్గొన్నారు.

ఊరి బడి ఉనికి ప్రశ్నార్థకం

ఆదోని సెంట్రల్: గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఉంటాయా పోతాయా అనేది ప్రశ్నార్థకంగా మారిందని ఎస్టీయూ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ జి.వీరచంద్రయాదవ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 117 రద్దు చేసి ఉన్నత పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులు వెనక్కి తీసుకురావాలనే ఉద్దేశంతో 1550 ఉన్నత పాఠశాలల్లో 1, 2 తరగతులను చేర్చి ఒకటి నుంచి పదో తరగతి వరకు ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తుందన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలకు తల్లికి వందనం పరిమితం చేయాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రాథమిక విద్యారంగాన్ని కాపాడాలన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుకను సత్కరిస్తున్న మాచాని వెంకటేష్ తదితరులు

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు కొత్తగా పార్టీ కమిటీల్లో నియామకమైన వారు కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. పార్టీ రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శిగా నియామకమైన మాచాని వెంకటేష్ బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమెను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు ఐక్యతతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహులు, నందవరం మండల పార్టీ అధ్యక్షుడు శివప్పగౌడ్, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి ముగతి విరుపాక్షిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ బజారి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీడీవో బంగారమ్మ

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత అని ఎంపీడీవో బంగారమ్మ, సీడీపీఓ సఫర్నీసాబేగం అన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిషత్ సమావేశ భవనంలో ×కిశోర వికాసం¤ అనే అంశంపై అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్ఎమ్స్, మహిళా పోలీసులు, ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే పెళ్లిల్లు చేయటం వలన అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందని చెప్పారు. గ్రామాల్లో అంగన్వాడీలు, మహిళా పోలీసులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు బాల్య వివాహాలను గుర్తింటంపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మండల మెడికల్ అధికారిణి అపర్ణ, ఏపీఎం జయశ్రీ, సూపర్‌వైజర్లు గుణశేఖరమ్మ, సరేఖ, రాధ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటో డ్రైవర్‌కు జైలుశిక్ష

ఆదోని రూరల్: మద్యం సేవించి ఆటో నడిపిన కల్లుబావికి చెందిన గొల్ల వీరేష్‌కు నెల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 22వ తేదీన డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడిన వీరేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. విచారించిన న్యాయమూర్తి నెల రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు.

వ్యక్తిపై దాడి- కేసు నమోదు

నందవరం: ముగతి గ్రామంలో పొలం వివాదంలో వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేశవ తెలిపారు. గ్రామానికి చెందిన బోయ ఎర్రిస్వామి తల్లికి సర్వే నెంబర్ 34ఏలో 3 ఎకరాల భూమి ఉంది. ఆ భూమి వివాదం కోర్టులో ఉండటంతో ఎర్రస్వామి ఇంజెంక్షన్ ఆర్డర్ తెచ్చుకుని పొలాన్ని ట్రాక్టర్‌తో దుక్కి చేయడానికి వెళ్లగా బోయ నాగరాజు, అతని కుమారుడు దస్తగిరి అడ్డుకుని ఎర్రిస్వామిపై దాడి చేశారు. గాయపడిన ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

గోనెగండ్ల: చిన్ననేలటూర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ విజయ భాస్కర్ తెలిపారు. సమాచారం మేరకు బుధవారం సాయంత్రం పోలీసులు చిన్న నేలటూర్ గ్రామంలో ఈడిగ నరసింహుడు ఇంటిలో తనిఖీ చేయగా.. 36 మద్యం బాటిళ్లు లభించడంతో కేసు నమోదు చేశామన్నారు. మండలంలో ఎవరైన అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైన మద్యం అమ్ముతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

పత్తికొండ రూరల్ : పత్తికొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు బుధవారం పట్టణ సమీపంలోని నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. మధు అనే వ్యక్తి నుంచి 10 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ విశ్వేశ్వరరావు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది రాజేష్, తేజ్ ఉన్నారు.

రీ సర్వేపై రైతులు ఆందోళన చెందొద్దు



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

గోనెగండ్ల: మండలంలో ఇటీవల జరిగిన రీ సర్వేపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ న్యాయం చేస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హామీ ఇచ్చారు. గోనెగండ్లలోని రైతు సేవా కేంద్రంలో రీ సర్వేపై ఏర్పాటు చేసిన గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. రీ సర్వేపై గ్రౌండ్ వ్యాలిడేషన్‌లో పొరపాట్లకు తావులేకుండా సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. రీ సర్వే పూర్తయిన రైతులకు నోటీసులో పొందుపరిచిన విస్తీర్ణంను సరిచూసుకోవాలని, ఏదైనా అభ్యంతరాలు ఉంటే పొలానికి సంబంధించి రికార్డులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. రికార్డుల ఆధారంగా ఇరువైపుల రైతులతో మాట్లాడి భూ సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాస రాజు, తహసీల్దార్ కుమారస్వామి, రీ సర్వే డీటీ శిరీష, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

పీజీఆర్ఎస్, సీఎంఓలో వచ్చిన వినతులను గడువు లోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ సందర్శించారు. అనంతరం పీజీఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం), సీఎంఓ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జిదారులను పిలిపించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించి అర్జిదారులను సంతృప్తి పరిచేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, ఆర్ఐ జనార్దన రావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇల్లు నిర్మించి ఇవ్వాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ కర్నూలు జిల్లా చైర్మన్ ఆంజనయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు.

కిశోరి వికాసం గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలి



కిశోరి వికాసం పుస్తకావిష్కరణ చేస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు

కోసిగి: కిశోర వికాసంపై మే 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు గ్రామ స్థాయిలో బాలికలను అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, హెల్త్ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్లు భాగ్యలక్ష్మీభాయి, కాత్యాయినిలు మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కార్యకర్తలు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా 15 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలకు కిశోరి వికాసం అవగాహన కల్పించి ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించేలా చెప్పాలన్నారు. అలాగే 11- 14 ఏళ్ల లోపు బడిమానికి వేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలకు వెళ్లేలా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి చదువులోనే బంగారు భవిష్యత్ ఉంటుందని సూచించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ రాముడు, హెల్త్ సిబ్బంది, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడే.. మేడే!



ఉపాధ్యాయుడు వెంకటేశప్ప గీసిన చిత్రం



సోమప్ప సర్కిల్‌లో కట్టిన ఎర్ర జెండాలు

కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఆయా సంఘాల ఆధ్వర్యంలో గురువారం పలు కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. మేడే పురస్కరించుకుని పట్టణంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ తదితర కార్మిక సంఘాలు తమ కార్యాలయాలు, కూడళ్లను ఎర్రజెండాలతో ముస్తాబు చేశాయి. ఇందులో భాగంగా స్థానిక సోమప్ప సర్కిల్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆ సంఘ జెండాలను కట్టడంతో ఆప్రాంతమంతా ఎర్రజెండాలు రెపరెపలాడుతున్నాయి. పలు రంగాల్లో పనిచేసే కార్మికుల కష్టాలను కళ్లకు కట్టేలా చూపుతూ శ్రమజీవులకు, ఉద్యమకారులకు మేడు శుభాకాంక్షలు చెబుతూ నందవరం మండలం కనకవీడు జిల్లా పరిషత్ హై స్కూల్ తెలుగు ఉపాధ్యాయులు కాకె వెంకటేశప్ప ఆవిష్కరించిన చిత్రం ఆకట్టుకుంది. – ఎమ్మిగనూరుటౌన్/నందవరం

తల్లీ దీవించు!

పార్లపల్లి, కలుగొట్ల గ్రామాల్లో శ్రీ పెద్దమ్మ అవ్వ, శ్రీ దుర్గాదేవి దేవర బుధవారం ఘనంగా జరిగింది. ఆయా గ్రామాల్లో అమ్మవార్ల దేవాలయం వరకు ప్రతి ఇంటి నుంచి కుంభాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ దేవరకు గ్రామస్తులే కాక చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నారు.

– ఎమ్మిగనూరురూరల్



పార్లపల్లి గ్రామంలో కుంభాలతో వెళ్తున్న గ్రామస్తులు